AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

హైదరాబాద్ నగరంలో కాల్పుల కలకలం..

అక్షరటుడే, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. కోఠి ఎస్‌బీఐ కార్యాలయం వద్ద దుండగులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రషీద్ అనే వ్యక్తిపై దుండగులు కాల్పులు జరిపారు. అతడి నుంచి రూ.6 లక్షలకు పైగా దోచుకున్నారు. డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన ఆయనపై గన్‌తో షూట్ చేశారు. దీంతో రషీద్ కాలికి బుల్లెట్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దాడి అనంతరం దుండగులు అతడి వద్ద ఉన్న సుమారు రూ.6 లక్షల నగదును దోచుకుని అక్కడి నుంచి పరారయ్యారు. సుల్తాన్ బజార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

ఓటీటీలోకి 'మన శంకర వరప్రసాద్ గారు'..

అక్షరటుడే, సినిమా డెస్క్: మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా త్వరలో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా హక్కులను జీ-5 దక్కించుకుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా తెరకెక్కిన సినిమా సంక్రాంతి సందర్భంగా విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకొని మంచి వసూళ్లను రాబట్టింది. కాగా.. ఈ చిత్రం ఫిబ్రవరి 11 నుంచి జీ 5లో స్ట్రీమింగ్ కానుంది.

31-1-2026 (Saturday) MAIN EDITION

బంగాళాఖాతంపై 'నోటమ్' జారీ

అక్షరటుడే, ఢిల్లీ: బంగాళాఖాతంపై భారత్ నోటమ్ జారీ చేసింది. ఫిబ్రవరి 5 - 6 తేదీల్లో బంగాళాఖాతంపై 3,190 కిలోమీటర్ల పరిధిలో విమానాలను అనుమతించబోమంటూ ఎయిర్‌లైన్లకు నోటీసులు (నోటమ్) ఇచ్చింది. గతంలో 2,530 కిలోమీటర్లు ఉన్న నోటమ్ పరిమితిని సుమారు 3,190 కిలోమీటర్లకు పెంచినట్లు తెలుస్తోంది.

తెలంగాణపై చిన్నచూపు: పొన్నం

అక్షరటుడే, హైదరాబాద్: బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్ర బీజేపీ ఎంపీలు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణపై ప్రధాని మోదీ చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలన్నారు. ఆర్ఆర్ఆర్, మెట్రోకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు.

చంద్రబాబు ఇ–సైకిల్ ర్యాలీ



అక్షరటుడే, ఏపీ: కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబు కడపల్లెలోని తన నివాసం వద్ద ఇ–సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదిక వరకు జరిగిన ఇ–సైకిల్ ర్యాలీలో స్థానికులతో కలిసి పాల్గొన్నారు. ఇ–సైకిళ్ల పంపిణీతో చిత్తూరు జిల్లా గిన్నిస్ బుక్ రికార్డు సాధించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

జమ్మూ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: జమ్మూ కశ్మీర్‌లోని కిష్త్వార్‌లో శనివారం ఉదయం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య కాల్పులు జరిగాయి. డోల్గామ్ గ్రామంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం మేరకు బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఆపరేషన్ ట్రాషి-1 పేరిట కొన్ని రోజులుగా కేంద్ర బలగాలు ఉగ్రవాదుల కోసం కూంబింగ్ చేపడుతున్నాయి. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం.

రైలు కిందపడి కుటుంబం ఆత్మహత్య

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: హైదరాబాద్ నగరంలో విషాదం చోటు చేసుకుంది. రైలు కింద పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. చర్లపల్లి ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. మృతులను బోడుప్పల్‌లోని హరితహారం చెందిన సురేందర్‌రెడ్డి, విజయ, చేతనరెడ్డిగా గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబం మొత్తం ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియరాలేదు. ఈ విషాద ఘటనతో బోడుప్పల్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఐవోసీఎల్‌లో 394 అప్రెంటిస్ ఖాళీలు

అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్: భారతీయ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ పైప్‌లైన్స్ డివిజన్‌లో టెక్నికల్, నాన్‌టెక్నికల్ ట్రేడ్స్ కోసం అప్రెంటిస్‌లను నియమిస్తోంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఐటీఐ, ఇంటర్ అర్హతలతో పలు పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం 394 వివిధ పోస్టులు ఉన్నాయి. జనవరి 31 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసువారు అర్హులు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం https://iocl.com/ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

గెలుపు గుర్రాలకే టికెట్లు

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. నామినేషన్ల పర్వం ముగియడంతో అభ్యర్థులు ప్రచార బాట పట్టారు. అధికార కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించాలని ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు జిల్లాలకు మంత్రులను ఇన్‌ఛార్జీలుగా నియమించింది. అంతేగాకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార సభలు సైతం నిర్వహించనున్నారు. తాజాగా ముఖ్యమంత్రి పార్టీ టికెట్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. గెలుపు గుర్రాలకే బీఫాంలు ఇవ్వాలని ఆదేశించారు. – అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ సీఎం రేవంత్‌రెడ్డి ■ జూమ్ మీటింగ్‌లో మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష ■ సమష్టిగా పనిచేయాలని సూచన

రాష్ట్రంలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లలో పోటీ చేయడానికి కాంగ్రెస్ నుంచి చాలా మంది నామినేషన్ వేశారు. ఒక్కో స్థానం నుంచి ఒకటి కంటే ఎక్కువ మంది టికెట్ ఆశిస్తున్నారు. ఈ మేరకు నామినేషన్ సైతం వేశారు. బీ ఫామ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం అమెరికా నుంచి జూమ్ మీటింగ్ ద్వారా మున్సిపల్ ఎన్నికలపై సమీక్షించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఇన్‌ఛార్జి మంత్రులతో సమావేశం నిర్వహించారు. గెలిచే అభ్యర్థులకు బీఫాం ఇవ్వాలని ఆదేశించారు. నాయకులు తమకు నచ్చిన వాళ్లకు టికెట్ ఇవ్వకుండా గెలుపు గుర్రాలకే ఇవ్వాలన్నారు. సమష్టిగా పని చేస్తే విజయం సాధిస్తామని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు రుజువు చేశాయని గుర్తు చేశారు.

ఇప్పుడే ప్రకటించొద్దు

మున్సిపల్ ఎన్నికల్లో నాయకులు అంతా కలిసి పని చేసి పార్టీని గెలిపించుకోవాలని సీఎం సూచించారు. ఛైర్‌పర్సన్, మేయర్ అభ్యర్థులను ఇప్పుడే ప్రకటించొద్దన్నారు. సామాజిక సమీకరణాల ప్రకారం ఛైర్‌పర్సన్‌లను ఎంపిక చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే పలువురు అభ్యర్థులు తామే ఛైర్ పర్సన్ అభ్యర్థులం అంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కౌంటింగ్ అనంతరం కాంగ్రెస్ పార్టీ మేయర్, ఛైర్‌పర్సన్‌లను ఫైనల్ చేసే అవకాశం ఉంది.

ఫిబ్రవరి 4 నుంచి సీఎం ప్రచారం

మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి ముఖ్యమంత్రి షెడ్యూల్ మారింది. మొదట ఫిబ్రవరి 3 నుంచి ఆయన ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. తాజాగా ఫిబ్రవరి 4 నుంచి సీఎం ప్రచార సభలు మొదలు కానున్నట్లు వెల్లడించాయి. 4న మిర్యాలగూడలో, 5న చొప్పదండి, 6న నిజామాబాద్, 7న పరిగి, 8న భూపాలపల్లిలో సీఎం సభలు నిర్వహించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది. మున్సిపాలిటీల్లో సైతం సత్తా చాటాలని ఆ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది.

సిట్ నోటీసులపై కేసీఆర్ సమాలోచనలు

అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన నేతలు, న్యాయవాదులతో ఎర్రవల్లిలో సమాలోచనలు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు నిన్నటి నుంచి ఎర్రవల్లిలోనే ఉన్నారు. రేపటి సిట్ విచారణ అంశంపై చర్చిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎర్రవల్లిలో తాను ఉంటున్న ఇంటికే వచ్చి విచారించాలన్న కేసీఆర్ విజ్ఞప్తిని సిట్ తోసిపుచ్చిన విషయం తెలిసిందే. అక్కడకు రాలేమని చెబుతూ హైదరాబాద్‌లోనే విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో విచారణకు అందుబాటులో ఉండాలని పేర్కొంది.

మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మహారాష్ట్ర చరిత్రలో తొలి మహిళా డిప్యూటీ సీఎంగా సునేత్ర నిలవనున్నారు. ఈ నెల 28న జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆయన భార్య, ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్న సునేత్ర ఆ పదవి చేపట్టనున్నారు. ఆమె 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం రాజ్యసభ సభ్యురాలిగా ఎంపికయ్యారు.

అప్పులు అడగడం సిగ్గుగా అనిపించింది: పాక్ ప్రధాని

అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు పాకిస్థాన్ మిత్ర దేశాల వద్దకు వెళ్లి రుణాలు అడుగుతున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. అప్పులు అడగడం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో కలిసి నేను రహస్యంగా మిత్ర దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగామన్నారు. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించిందని పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండ్ చేసినా సరే.. అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు.

హైదరాబాద్ లో భారీగా గంజాయి పట్టివేత

అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో గంజాయి, డ్రగ్స్ దందా ఆగడం లేదు. పోలీసులు దాడులు చేస్తున్నా.. కొందరు గంజాయి విక్రయాలు జోరుగా చేపడుతున్నారు. నగరంలోని ధూల్‌పేట్‌లో శనివారం భారీగా గంజాయి పట్టుకున్నారు. 1,532 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కిషోర్ సింగ్, సురేందర్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. ఎవరికి సప్లయ్ చేస్తున్నారనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మరోసారి అమెరికాలో షట్‌డౌన్..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికాలో ఫెడరల్ ప్రభుత్వం మరోసారి పాక్షిక షట్‌డౌన్ అయ్యింది. 2026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఆమోదం కోసం నిర్ణయించిన గడువు అర్ధరాత్రి ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు పాక్షికంగా స్తంభించాయి. ఈ విషయాన్ని అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. మినియాపొలిస్ నగరంలో ఇటీవల జరిగిన ఒక దుర్ఘటన ఈ షట్‌డౌన్‌కు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారుల కాల్పుల్లో ఇద్దరు ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సెనెట్‌లోని డెమోక్రాటిక్ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీఈ విధానాల్లో సంస్కరణలు రాకపోతే నిధుల బిల్లుకు తమ ఓట్లు వేయబోమని స్పష్టం చేశారు. ఫలితంగా హోంలాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌తో పాటు కొన్ని ఇతర విభాగాలకు నిధులు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

నభా నటేష్ ఇన్‌స్టా పోస్ట్ వైరల్..

'నన్ను దోచుకుందువటే' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బామ నభా నటేష్. ఈ అమ్మడు గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత 'అదుగో', 'ఇస్మార్ట్ శంకర్' 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్' మూవీల్లో నటించింది. అయితే ఈ చిన్నది సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. చాలా సింపుల్ శారీలో చాలా ఎలిగెంట్‌గా కనిపించింది. హెయిర్ లీవ్ చేసుకుని చాలా నేచురల్ బ్యూటీలా కవ్వించింది. ఇక వాటికి.. 'జంట' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ వైరల్‌గా అయ్యింది.

–అక్షరటుడే, సినిమా డెస్క్

ముగియనున్న మేడారం జాతర

అక్షరటుడే, ములుగు: మేడారం మహా జాతర నేటితో ముగియనుంది. చివరి రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. మేడారం సమ్మక్క-సారక్క జాతర ఈ నెల 28న ప్రారంభమైన విషయం తెలిసిందే. 28న సారలమ్మ గద్దెలపైకి వచ్చారు. 29న సమ్మక్క గద్దెపై కొలువుదీరారు. అమ్మలను దర్శించుకోవడానికి శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. శనివారం దేవతలు వన ప్రవేశం చేయడంతో జాతర ముగియనుంది. దీంతో చివరి రోజు అమ్మవార్ల దర్శనానికి భారీగా భక్తులు వచ్చారు. దీంతో పలు మార్గాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చారు. నేడు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో జాతర ముగింపు కార్యక్రమం చేపట్టనున్నారు.